

# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## ముదిగొండ లింగమూర్తి

### (1989, జనవరి విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)




మద్రాసు మహానగరంలో ఒక సభ జరుగుతోంది. ఆ సభలో వక్తగా ఆహ్వానించబడ్డ ముదిగొండ లింగమూర్తి వేదిక పైకి రాగానే, నిర్వాహకులు ఆయన మెడలో మాల వేశారు, అత్యంత మధురమైన మందహాసంతో ఆయన మెడ వంచి మాల వేయించుకుని మైక్ దగ్గరకొచ్చి – ఒక క్షణం ఆగి "నేనీ దండ తియ్యను" అన్నారు సీరియస్ గా. సభికులు కొందరు ఆశ్చర్యంగా చూస్తే, కొందరు గలగలా నవ్వారు, “అవును. ఎంతో ఆప్యాయంగా వేదిక పైకి పిలిచి సగౌరవంగా మెడలో దండవేస్తే వెయ్యక ముందే దాన్ని అందుకుని "అహహ నేను తగను, నేను తగను" అన్నట్టు చేతులతో పట్టేసుకుంటారు. నేనీ దండని ఇలా మెడలో వుంచుకునే ఉపన్యాసం కొనసాగిస్తాను" అని ఆరంభించారు లింగమూర్తి. అంతకుముందు ప్రసంగించడానికొచ్చిన వాళ్ళంతా అలా దండలు తీసేసినందుకు నిరసనగా. ఆయనది అంతటి తెగింపు! నిర్మొహమాటం!

ఆ తర్వాత నాగయ్యగారొచ్చారు మాట్లాడ్డానికి. ఆయనకి దండ వేస్తే, వేసీ వెయ్యగానే తీసేయలేదుగాని, ఓ క్షణం వుంచి తీసేశారు లింగమూర్తి గారి వేపు ఓరగా చిరునవ్వుతో చూస్తూ. "మా లింగమూర్తి బావ దండ తియ్యనన్నాడు. కాని, ఇంతమంది పెద్దల ముందు దండ వేసుకుని నిలబడ్డం, సభా మర్యాద కాదు గనక, తీసేస్తాంగాని, "తగం" అన్నట్టుగా కాదు. అసలు నిజమైన కళాకారుడికి మెడలో నిత్యం కనిపించని మాల వుండనే వుంటుంది" అని తన ఉపన్యాసం ఆరంభించారు నాగయ్య.

సభానంతరం "బావ" లిద్దరూ “దండ” మీద మళ్ళీ దండయాత్ర చేశారు ..... లింగమూ ర్తిగారు ఎమోషనల్ .... నాగయ్యగారు సాఫ్ట్ .... తను అన్నదే నిజం అని లింగమూ ర్తిగారు వాదనలోకి దిగితే, చిరునవ్వుతో నాగయ్యగారు "నా ఉద్దేశం అది – నీ ఇష్టం ఎలావుంది అలాగే కానీ" అన్నారు. ఆ వాదన అయిపోయిన తర్వాత ఇద్దరూ ఆప్యాయంగా “బావా” అని పిల్చుకుంటూ, ఒకటై నడిచారు.

ఇద్దరూ “బావా బావా” అని అంత ఆత్మీయతతో పిల్చుకున్నా, ధోరణిలో ఇద్దరూ భిన్న ధ్రువాలు: ఏ విషయం మీదా ఇద్దరూ ఏకాభిప్రాయానికి రారన్న అభిప్రాయం మనకి కలిగించినా, లింగమూ ర్తిగారిదే పై చెయ్యి అవుతుంది. ఆయనది అంతటి పట్టు: ఏ విషయం మీదా రాజీ పడని మనిషి! ఎదటివాళ్ళు ఏమనుకుంటారోనన్న మొహమాటం ఇసుమంత కూడా లేని, ముక్కు సూటి వ్యక్తి ముదిగొండ లింగమూర్తి. ఆయన ఎక్కడ మాట్లాడినా, ఏ సభలో మాట్లాడినా, ఎవరితో మాట్లాడినా ఆయన ధోరణిలో రాజీ కనిపించదు. అంతటి ముక్కుసూటి మనిషి గనకనే ప్రతి సభకూ ఆయన ఒక అలంకారం, లింగమూర్తి గారు వేదిక మీద నిలబడితేనే – హర్షవర్షం కురిసేది – ఎవర్నో బాగా దుయ్యబడతారని .....

మనకివున్న నిజమైన. "కారెక్టర్ ఆక్టర్స్" లో లింగమూర్తి ఒకరన్నది – సూర్యుడు తూర్పున ఉదయిస్తాడన్నంత సత్యమైనది. ఆయన అన్ని రకాల పాత్రలు ధరించారు. అన్నీ అంత ఉన్నతంగానూ ఒప్పించారు. "వందేమాతరం" నుంచి చూసుకుంటే, వాహినీ చిత్రాల్లో ఆయన చేసిన పాత్రలన్నీ భిన్నమైనవే. ఏ పాత్రకీ ఏ పాత్రకి సంబంధం వుండదు. ఆయన ఫక్తు దుష్టపాత్రలూ, హాస్యపాత్రలూ, కరుణరస ప్రధాన పాత్రలూ ఎన్నో ధరించారు, మెప్పించారు. రంగస్థలం మీదనే బాగా పండి, చిత్రాల్లోకి వచ్చిన మహానటుడాయన. మంచికంఠం, ఉచ్చారణ వాటికి తగ్గ ముఖభావం ఆయన సొత్తు. అటు పౌరాణికాలు, ఇటు సాంఘికాలూ, జానపదాలూ ఏవీ ఆయన్ని తప్పించుకో లేదు:

ఆయన చాలా ప్రాక్టికల్ మనిషి. లోతైన స్టడీగల మనిషి. ఎంతటి దర్శకుడు ఎంత గొప్పగా చెప్పినా తాను "కన్విన్స్" కాకపోతే ఒప్పుకోని మనిషి. "ఒకసారి మా బియన్ తోనే పడింది. నాకు. 'స్వర్గ సీమ' లో నేను భానుమతి తండ్రిని. పల్లెటూరువాడిని. హీరోని వల్లో వేసుకోవాలని కూతురుతో చెప్పే సన్ని వేశంలో "ఎన్నాళ్ళని ఈ బిగువు: చేతులు కలిపితే అన్నీ సరిపోతాయి. వాడేం దయ్యమా రాక్షసుడా? దగ్గరకెళ్ళి అంతా సరిచేసుకో" అని చెప్పాలి. నాకెందుకో

అందులో చమత్కారం కనిపించలేదు. ఆ మాటే అన్నాను బిఎన్ తో. "చమత్కారం ఏం చేస్తావో చెయ్యి" అన్నాడాయన కోపంగా. ఆయనకి మెత్తగా. నచ్చజెప్పి "నేను చెప్తాను చూడండి. బాగుంటే వుంచండి. లేకపోతే లేదు." అన్నాను. అని "వాడేం పులా, సింగమా! తెలివితేటలుండాలి. వూ" అని, 'వూ' అనడంలోనే చమత్కారం చూపిస్తే, దర్శకుడు బిఎన్, రచయిత సముద్రాలా ఇద్దరూ సరే అన్నారు. సినిమాలో ఆ మార్పు ఎంత బాగా పట్టుకుందీ జనాన్ని!" అని చెప్పారోసారి లింగమూర్తి–నటుడు తనదీ అని కొంత సొంతం చేసుకోవాలని చెబుతూ, అందుకనే ఇలాంటి "చాదస్తాలు" గల లింగమూర్తి జోలికి పోని దర్శకులు, నిర్మాతలు కూడా వున్నారు. ఒక దశలో ఆయనకి సినిమాలు లేవు. ఖాళీగానే వున్నారుగదా, ఎంతిస్తే అంతా తీసుకుని నటిస్తాడని ఒక నిర్మాత తన చిత్రం పౌరాణికంలో నటించమని అడిగాడు. 'అలాగే' అని డబ్బు మాట అడిగారు లింగమూర్తి. 'ఇంత' అన్నాడు నిర్మాత, "నేనొప్పుకోను. సినిమాలు తగ్గొచ్చుగాని, నా టాలెంట్ తగ్గలేదు. నా టాలెంట్ కి ఒక రేటుంది. ఆ రేటుకి పైసా తగ్గను. సినిమాల్లో వేషాలు లేకపోయినా ఫర్వాలేదుగాని, నేను పెట్టుకున్న కనిష్ఠ పారితోషికాన్నుంచి మాత్రం కిందికి దిగను" అని కుండ పగలగొట్టినట్టు చెప్పడం ఆయనకే చేతనైంది.

"కన్యాశుల్కం" నాటకంలో స్థానం నరసింహారావు మధురవాణి వేస్తే లింగమూర్తి రామప్పంతులు వేసేవారు." ప్రతిసారీ ఏదో చమత్కారం జరుగుతూనే వుండేది. స్టేజి మీద ఓసారి ఒక కొత్తవాడు పూటకూళ్ళమ్మ వేషం వేశాడు. చీపురుతో గిరీశాన్ని కొట్టబోయి నన్నే కొడుతున్నాడు తెలియక. గిరీశం మంచంకింద లోపలగా, దూరివున్నాడు. అంచేత రామప్పంతులు దొరికాడు – ఎవరైతే ఏం అవి పూటకూళ్ళమ్మ రామప్పంతుల్ని బాదడం మొదలెట్టాడు. నేను "ఇదేం గొడవరా" అని అటూ ఇటూ పరుగెత్తడంతో చీపురు కట్ట కింద పడిపోయింది. అది తీసి, పూటకూళ్ళమ్మ చేతికిచ్చి "వూ కొట్టు నన్నే కొట్టు. ఆ గిరీశంగాడు నీకు అందడు గనక నన్నే కొట్టు" అన్నాను వంగి. అప్పుడుగాని, ఆ పూటకూళ్ళమ్మకి అర్థం కాలేదు. ఎవర్ని కొట్టాలో. ఆ మాటికి అప్పటికప్పుడే ప్రేక్షకులు మాత్రం చప్పట్లు కొట్టారు. ఇదెందుకు చెప్పానంటే, నటుడు అంటే రంగస్థలం మీద నటించే నటుడు. రచయిత గీసిన వృత్తంలోనే పరుగెత్తితే లాభం లేదు. సందర్భశుద్ధిగా అవసరం అనుకున్నప్పుడు తానూ ఒక మాట అని, సందర్భాన్ని కాపాడగలిగే నేర్పు వుండాలి "అని చెప్పేవారు. లింగమూర్తి.

"టాకీ షాట్స్ లో సైలెంట్ రియాక్షన్స్ ఇవ్వడంలో లింగమూర్తిగారు గట్టివారు "అనే వారు మార్గదర్శకుడు కె. వి. రెడ్డి. యోగి వేమన: చివరి దృశ్యంలో వేమన ఆఖరిసారిగా అభిరాముని (లింగమూర్తి) హత్తుకునే షాటు, కెమెరా లింగమూర్తిగారి వీపును చూపిస్తోంది. "వేమన కావలించుకోగానే తన ఒళ్ళు జలదరించినట్టూ. పులకరించినట్టు అభిరాముడు వీపులోనే ఎక్స్ ప్రెషన్ ఇచ్చాడు:" అని కె. వి. అభినందించేవారు.

"యాక్షన్ కంటే రియాక్షన్ ఇవ్వడం కష్టం. మన రియాక్షన్ బావుంటే అవతలివాడి యాక్షను ఒక్కోసారి మెరుగవుతుంది. ఒక్కోసారి తరుగూ అవుతుంది" అని చెప్పే ఆ మహానటుడు అనేక రేడియో నాటకాల్లో కూడా ప్రముఖంగా పాల్గొన్నారు. "అక్కడ వాచకమే ప్రధానం. అంచేత మామూలుగా చేతులతో, కళ్ళతో, ముఖంతో చేసే నటనంతా ఒక్క కంఠంతోనే చెయ్యాలి" అని ఆ "స్టడీ" గురించి చెప్పేవారాయన.

పానగల్ పార్కులో సాయంకాలాల వేళల్లో ఆ రోజుల్లో కనిపించే సినిమా మహామహుల్లో లింగమూర్తి ఒకరు. "అందరూ పార్కుకి ఎందుకొస్తారు. కాలక్షేపానికి. నేను మాత్రం సొల్లు బాతాఖానికి రాను. పనికొచ్చే మాటలుంటే వుంటాను. లేకపోతే ఇంటికే" అని చెప్పే ఆయనకి, అనవసర చర్చ ఇష్టం వుండేదికాదు. ఆ 'బాతాఖానీ' లోనూ విషయం వుండాలి. తాను 'ఎమోషనల్' గా వాదించాలి:

ఆయన చిత్రాల్లో నటిస్తున్నప్పుడు దృశ్యంలో ఇంకో గొప్ప నటుడు కూడా వుంటే, ఆ నటుడి మీర తాను గెలవాలని .. దానికి ఏం చెయ్యాలనీ ఆలోచించేవారాయన. 'పాండవవనవాసం' లో రంగారావు దుర్యోధనుడు, లింగమూర్తి శకుని. "ఈ సీనులో రంగణ్ని జయిస్తాను చూడు" అని ఆయనంటే "రమ్మను. నా శక్తి నేనూ చూపిస్తాను" అని రంగారావు అనేవారు. నటనలో అంతటి ఆరోగ్యకరమైన పోటీ!

చివరి దశలో లింగమూర్తి సన్యాసాశ్రమం తీసుకున్నారు. పూర్ణసాత్వికత్వంతో కనిపించేవారు. ఐతే, అప్పుడూ చమత్కారాల మానలేదు. "చదువుకుంటున్న రోజుల్లో మా మాస్టారు తప్పు చేస్తే "ఓరి సన్నాసీ" అనేవారు. ఆయన మాట ఊరికే పోదు అంటారు" అన్నది ఆయన చమత్కారమే.

ప్రతి విషయాన్నీ తర్కం, స్వభావం, శాస్త్రంవీటితో రంగరించి విపులీకరించి చర్చించే లింగమూర్తిగారు ఎందరికో మిత్రుడు, గురువు, ఆప్తుడు. ఆయన పాత్రల్ని జీవింపచేసుకున్నట్టే తన ధోరణిని జీవింపచేసుకున్న భూమికా నిర్వహణ సమర్థుడు

-రావికొండలరావు

COMMENTS